ఇక ప్రైవేటుకే మద్యం అమ్మకాలు

● ఉమ్మడి జిల్లాలో 319 దుకాణాలకు దరఖాస్తులు ● ఈ నెల 9 వరకు గడువు.. కసరత్తు చేస్తున్న అధికారులు



ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నూతన మద్యం విధానం అమల్లోకి వచ్చింది. గతంలో మద్యం రిటైల్ వ్యాపారం ప్రైవేటుగా నిర్వహించగా.. వైకాపా అధికారంలోకి వచ్చాక దాన్ని మార్చేసి ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వమే మద్యం విక్రయాలను చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ విధానాన్ని మార్చేసింది. మద్యం రిటైల్ వ్యాపారం తిరిగి ప్రైవేటుగా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసింది. దీన్ని మంగళవారం నుంచే అమల్లోకి తీసుకొచ్చింది. దరఖాస్తుల ఆహ్వానం, టెండర్ల ప్రక్రియ నిర్వహించి త్వరితగతిన దుకాణాల్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు షెడ్యూలు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాలను అనుసరించి ప్రణాళిక అమలు చేసేందుకు కసరత్తు ప్రారంభించారు.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 319 మద్యం దుకాణాలున్నాయి. వీటికి మంగళవారం నుంచి ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. 9వ తేదీ వరకు స్వీకరించి 11న కలెక్టర్ సమక్షంలో లాటరీ తీసి అభ్యర్థులకు లైసెన్సులు ఖరారు చేస్తారు. లైసెన్సులు దక్కించుకున్న వారు 12వ తేదీ నుంచే దుకాణాలను ప్రారంభించేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దరఖాస్తుదారు రూ.2 లక్షల డీడీ తీయాలి. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా సమర్పించవచ్చు. ఆయా ప్రాంతాల్లోని ఎక్సైజ్ పోలీసుస్టేషన్లలో కూడా దరఖాస్తులు ఇచ్చే వెసులుబాటు కల్పించారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..	ఏలూరు	పశ్చిమ	మొత్తం
మద్యం దుకాణాలు	144	175	319
బార్ అండ్ రెస్టారెంట్లు	16	24	40
ఎక్సైజ్ స్టేషన్లు	07	06	13
సిబ్బంది	130	170	300

వ్యాపారుల ఆసక్తి.. గతంలో మద్యం దుకాణాలు నిర్వహించిన వ్యాపారులు, ఆశావహులు దుకాణాలు దక్కించుకునేందుకు ముందుకు వస్తున్నారు. గతంలో ఏళ్ల తరబడి మద్యం దుకాణాలు నిర్వహిస్తూ, ఆయా దుకాణాల్లో పని చేస్తూ ఉపాధి పొందిన వారంతా వైకాపా పాలనలో రోడ్డున పడ్డారు. ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించడంతో సిబ్బందికి పనిలేక బతుకుదెరువు కోల్పోయారు. కూటమి ప్రభుత్వం నూతన విధానంతో వారికి ప్రాణం లేచి వచ్చినట్లైంది.

పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ, కేటాయింపు.. దరఖాస్తుల స్వీకరణ, టెండర్ల ప్రక్రియ అంతా పారదర్శకంగా ఉంటుంది. కలెక్టర్ సమక్షంలో టెండర్లు తీసి లైసెన్సు దారులను ఖరారు చేస్తాం. ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాలను అనుసరించి అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు శాఖాపరంగా అధికారులను ఆదేశించాం. – బి.శ్రీలత, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్


రేపటి నుంచి దేవీ శరన్నవరాత్రులు

పెనుగొండ, న్యూస్‌టుడే: నగరేశ్వర, మహిషాసుర మర్దని, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఈ నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో గుబ్బల రామపెద్దింట్లరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వాసవీ కన్యకా పరమేశ్వరి, మహిషాసుర మర్దని అమ్మవార్లు 3న శ్రీబాల, 4న రాజరాజేశ్వరి, 5న లలితా దేవి, 6న అన్నపూర్ణాదేవి, 7న గాయత్రీ దేవి 8న లక్ష్మీదేవి, 9న సరస్వతీ దేవి, 10న శ్రీదుర్గాదేవి, 11న మహిషాసుర మర్దని అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు.

గ్రామ స్వరాజ్యానికి.. స్వచ్ఛ అడుగులు

కూటమి ప్రభుత్వంలో గ్రామాలకు ఊపిరి

స్వచ్ఛతా హీ సేవకు ప్రాధాన్యం



ఈనాడు, భీమవరం: దేశానికి పల్లెలే పట్టుగొమ్మలన్నారు మహాత్ముడు.. గ్రామ స్వరాజ్యమే దేశ సౌభాగ్యమని దృఢంగా విశ్వసించారు. గత వైకాపా అయిదేళ్ల పాలనలో బాపూజీ కలలను కల్లలు చేసి గ్రామ ప్రగతిని పాతాళానికి నెట్టేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ పల్లె ప్రగతికి పట్టాభిషేకం జరుగుతోంది. గ్రామసభల నిర్వహణ, అభివృద్ధికి నిధుల కేటాయింపు, స్వచ్ఛతా హీ సేవ వంటి కార్యక్రమాల ద్వారా పురోగతికి పెద్దపీట వేశారు.

సంపూర్ణ పారిశుద్ధ్య సాధనకు..

కూటమి ప్రభుత్వం పల్లెల్లో సంపూర్ణ పారిశుద్ధ్యాన్ని సాధించడానికి గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం చేపట్టింది. సెప్టెంబర్ 17 నుంచి 30 వరకు ఉమ్మడి జిల్లాలోని అన్ని పంచాయతీల్లో అధికారులు, సచివాలయ సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 11,857 అపరిశుభ్ర ప్రదేశాలను గుర్తించారు. వాటిలో ఇప్పటి వరకు 11,195 ప్రాంతాలను స్థానికుల సహకారంతో శుభ్రపరిచారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం బాగుంటేనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్న ఉద్దేశంతో వారితోపాటు కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేయించారు.

మంచి రోజులొచ్చాయ్..

గత వైకాపా సర్కారు పంచాయతీలను గాలికొదిలేసింది. వాటికి కేంద్రం ఇచ్చిన నిధులను ఇతర పథకాలకు మళ్లించారు. కనీసం పంచాయతీలకు విద్యుత్తు బకాయిలు కూడా చెల్లించని దారుణాలు కళ్లకు కట్టాయి. పంచాయతీ సిబ్బంది ఉండగానే ప్రత్యామ్నాయంగా సచివాలయాలను ఏర్పాటు చేశారు. నిధులు దోచేస్తున్నారని సర్పంచులు రోడ్లపై ధర్నాలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి పంచాయతీలకు ప్రాధాన్యం పెరిగింది.

ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణకు చిన్న పంచాయతీలకు రూ.15 వేలు, పెద్ద పంచాయతీలకు రూ.25 వేలు వంతున ఇచ్చారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాకు రూ.1.18 కోట్లు వచ్చాయి. ఉమ్మడి పశ్చిమలోని 941 సంపద సృష్టి కేంద్రాలను తిరిగి తెరుస్తున్నారు. తాగునీటి పథకాల నిర్వహణకు పెద్దపీట వేస్తున్నారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టి గ్రామాలను అగ్రపథానికి నడిపిస్తున్నారు.

పల్లె ప్రగతికి పట్టం

కూటమి సర్కారు అధికారం చేపట్టిన వెంటనే పంచాయతీల అభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి పశ్చిమకు రూ.294.5 కోట్ల ఉపాధి నిధులు కేటాయించారు. వీటిని ప్రజల వ్యక్తిగత సౌకర్యాలు, పంచాయతీ అవసరాలు, అంతర్గత రహదారుల ఏర్పాటు, నీటి సంరక్షణ చర్యల కోసం వినియోగిస్తారు. సీసీ, బీటీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, ఉద్యాన పంటల అభివృద్ధి, పశువుల షెడ్లు ఏర్పాటు, పాఠశాలల ప్రహరీలు, కల్వర్టుల నిర్మాణం, శ్మశానాల్లో దహన వాటికల ఏర్పాటు తదితర పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం గ్రామ సభల ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరించి, అవసరమైన నిర్ణయాలు తీసుకుంటారు.

	ఏలూరు	పశ్చిమ
చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలు	5,919	5,938
పూర్తి చేసిన పనులు	5,604	5,591
సంపద కేంద్రాలు	541	400
పంచాయతీలు	547	409
మొత్తం కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)	220	74.5
ఒక్కో నియోజకవర్గానికి కేటాయింపు (రూ.కోట్లలో)	20	7

అన్నదాతలకు ఊరట

రూ. 8.90 కోట్ల పెట్టుబడి రాయితీ విడుదల



వీరవాసరం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఆగస్టు నెలాఖరు నుంచి సెప్టెంబరు తొలి వారం వరకు కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఊరట లభించింది. అధిక వర్షాలు, ముంపు ప్రభావంతో జిల్లాలో దాదాపు 3,562 హెక్టార్ల విస్తీర్ణంలో పంట దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి రాయితీ కింద హెక్టారుకు రూ.25 వేల చొప్పున పరిహారం విడుదల చేసింది. దీని వల్ల జిల్లాలో 6,312 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. ఆకివీడు మండలంలో అత్యధికంగా 1,221 మంది రైతులకు సంబంధించిన 843.27 హెక్టార్లు, నరసాపురం మండలంలో 1,090 మంది రైతులకు సంబంధించిన 518.83 హెక్టార్లలో పంట నష్టం సంభవించింది. తరువాత స్థానాల్లో యలమంచిలి, అత్తిలి, కాళ్ల, వీరవాసరం మండలాలు ఉన్నాయి. పెట్టుబడి రాయితీ నగదు రైతుల ఖాతాల్లో జమవుతుందని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు తెలిపారు.

మండలాల వారీగా మంజూరైన సొమ్ము (రూ.లక్షల్లో) ఇలా..	
ఆచంట	9.84
ఆకివీడు	210.82
అత్తిలి	60.31
భీమవరం	21.64
గణపవరం	54.22
కాళ్ల	81.19
మొగల్తూరు	10.91
నరసాపురం	129.71
పాలకోడేరు	32.57
పాలకొల్లు	41.76
పెంటపాడు	5.81
పోడూరు	9.36
తాడేపల్లిగూడెం	0.74
ఉండి	62.13
వీరవాసరం	72.40
యలమంచిలి	87.13

కొబ్బరి సూదకు గిరాకీ
విదేశీ నగదు ఇస్తామని మోసం
8లో

పింఛన్ల పెంపుతో పేదలకు భరోసా

శృంగవృక్షం (పాలకోడేరు), న్యూస్‌టుడే: పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే ప్రభుత్వం పింఛను మొత్తాన్ని భారీగా పెంచిందని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. పాలకోడేరు మండలం శృంగవృక్షంలోని మంగళవారం ఆమె దివ్యాంగులకు సామాజిక పింఛన్ల నగదు, బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కుష్ఠు రోగుల పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడి యోగ క్షేమాలు తెలుసుకున్నారు.



శృంగవృక్షంలో దివ్యాంగులకు నగదు అందజేస్తున్న కలెక్టర్ నాగరాణి

97.8 శాతం పంపిణీ.. భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ తొలిరోజైన మంగళవారం 97.80 శాతం పూర్తయినట్లు డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,30,123 మంది లబ్ధిదారులకు గాను 2,25,017 మందికి నగదు అందజేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా తొమ్మిదో స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు.


గిరిజనానికి ప్రగతి వెలుగులు



బుట్టాయగూడెం, కుక్కునూరు, న్యూస్‌టుడే: సరైన సదుపాయాలకు నోచుకోక, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గిరిజన గ్రామాల్లో ప్రగతి వెలుగులు ప్రసరించనున్నాయి. ప్రధాన మంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ పథకం ద్వారా సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ అమలు చేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నవంబరు నుంచి పనులు చేపడతారు.

25 రకాల అభివృద్ధి పనులు.. జిల్లాలో ఈ పథకం అమలు కోసం తొలి విడత 46 గ్రామాలు ఎంపిక చేశారు. మన్యంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాలతోపాటు మైదానంలోని టి.నరసాపురం, చింతలపూడి, నూజివీడు, చాట్రాయి మండలాల్లోని గిరిజన గ్రామాలను ఎంపిక చేశారు. వాటిలో 25 రకాల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ నెలాఖరు లోగా గ్రామ సభలు నిర్వహించి పనులు గుర్తించాలి. కనీసం 500 మంది జనాబా కలిగి, అందులో 50 శాతం మంది గిరిజనులు ఉన్న రెవెన్యూ గ్రామాల్లో పథకం కింద నిధులు కేటాయించి వెచ్చిస్తారు.

పచ్చగా.. పది మందికి చెప్పేలా..



వృక్షంపై ప్రకృతిమాత



మొక్కను బతికించు.. చిత్రంతో..

చెట్లను కాపాడు.. బతికించు.. అనే నినాదంతో తణుకులోని చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాల ఆవరణలోని చెట్లపై విద్యార్థులు అందమైన వర్ణచిత్రాలను వేశారు. ఇవి చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పర్యావరణానికి మేలుచేసే వృక్షాలను పరిరక్షించేందుకు తమవంతు కృషిచేస్తున్నారు. వీటిని చూసిన ఇతర కళాశాలల విద్యార్థులు పచ్చదనం పరిరక్షణకు తమవంతు కృషిచేస్తామని చెబుతున్నారు.



పాండా, బుద్ధుని చిత్రాలు



మర్రిచెట్టు కాండంపై రంగులేసి సెల్ఫీ పాయింటుగా మలిచారిలా..

- ఈనాడు, తణుకు.

వినూత్న పరిశోధనలపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న వీరాంజనేయులు, చిత్రంలో వీసీ గోపాల్, వర్సిటీ అధికారులు

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: వినూత్న పరిశోధనలపై దృష్టి సారించాలని వెంకట్రామన్నగూడెం వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి గోపాల్ పేర్కొన్నారు. వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన కళాశాలలో జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)పై రెండు రోజుల అవగాహన కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ప్రొఫెసర్ జయశంకర తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వరంగల్ నిట్ కేంద్ర గ్రంథాలయ మాజీ గ్రంథపాలకుడు కె.వీరాంజనేయులు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఇ-వనరులపై అవగాహన కల్పించారు. వివిధ విభాగాల డీన్‌లు నారం నాయుడు, కేటీవీ రమణ, సూర్యకుమారి, రిజిస్ట్రార్ శ్రీనివాసులు, పరిశోధన సంచాలకురాలు మాధవి, విస్తరణ సంచాలకుడు గోవిందరాజులు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ నాగరాణి, అతిథులు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: గాంధీ మార్గం అనుసరణీయమని కలెక్టర్ నాగరాణి అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని భీమవరంలోని క్విట్ ఇండియా స్థూపం వద్ద ఏపీ గాంధీ స్మారక ఫౌండేషన్, శ్రీవిజ్ఞాన వేదిక, జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో మంగళవారం జాతిపిత వేషధారులతో ఉన్న చిన్నారులతో కలిసి నిర్వహించిన శాంతి ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. గాంధేయవాదులు ఎంటర్ రాజు, తమ్మలపల్లి మంగరాజు, ప్రస్తుత అధ్యక్షుడు తుమ్మలపల్లి శివ, మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామమోహనవర్మలను కలెక్టర్ సత్కరించి ప్రతిజ్ఞ చేయించారు. ఫౌండేషన్ చైర్మన్ పూర్ణచంద్ర గాంధీ (హైదరాబాద్), కార్యదర్శి రామచంద్రరావు, స్వరాజ్ నిర్మాణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొబ్బరి సూదకు గిరాకీ

పెరిగిన ధర.. పొరుగు రాష్ట్రాలకు ఎగుమతులు

అయిదడుగులకు పైబడి ఉండే కొబ్బరి మొక్క సరిగ్గా గత ఏడాది ఇదే రోజుల్లో రూ.13 పలికేది. ప్రస్తుతం అదే సైజు మొక్క రూ.24కు ధర పెరిగిందంటే కొబ్బరిసూదకు పెరిగిన గిరాకీ తెలుసుకోవచ్చు. జిల్లాలో పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లో కొబ్బరి నర్సరీలు ఎక్కువగా ఉన్నాయి. పెరిగిన ధరలతో పొరుగు రాష్ట్రాలకు కొబ్బరి మొక్కలు ఎక్కువగా ఎగుమతవుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.



కొబ్బరి మొక్కలు ఎగుమతి చేస్తున్న కూలీలు

పాలకొల్లు, యలమంచిలి, న్యూస్‌టుడే: నర్సరీల్లో లభించే వివిధ పరిమాణాల ఎత్తు మొక్కల్లో రెండు అడుగుల ఎత్తు మొక్కలకే ఎక్కువ మొగ్గు చూపుతుంటారు. రవాణాకు తేలిగ్గా ఉండటంతోపాటు భూమిలో బలంగా నాటుకుంటుందనే ఉద్దేశంతో చిన్న మొక్కలనే ఎక్కువగా నాటుతుంటారు. 2023 సెప్టెంబరులో ఈ మొక్క ధర రూ.12 పలకగా ప్రస్తుతం రూ.23 ఉంది. పెద్ద మొక్కలకు చిన్న మొక్కలకు ధర వ్యత్యాసం ఒక్క రూపాయి మాత్రమే ఉండటం గమనార్హం.

ఎగుమతులు ఎక్కడికంటే.. ప్రస్తుతం జిల్లా నుంచి కొబ్బరిసూదను అసోం, పశ్చిమ బంగా, బీహార్, గుజరాత్ రాష్ట్రాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తున్నట్లు యలమంచిలి మండలం అడవిపాలెంనకు చెందిన నర్సరీ యజమాని బోలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. లారీకి పెద్దవి పది వేల మొక్కల వరకు, రెండు అడుగుల మొక్కలైతే 20 వేలకు పైగా ఎగుమతి చేస్తుంటామని ప్రస్తుత సీజన్‌లో పాలకొల్లు, వరిధన, పెనుమదం గ్రామాల నుంచి నెలకు సరాసరి 20 లారీల సూద ఎగుమతి జరుగుతుందన్నారు.

పెరిగిన ధరలతో ఊరట.. గత ఏడాది కొబ్బరికాయలకు సరైన ధరలు రాక చాలామంది నిల్వలు పోశారు. వాటిలో మొక్క కాయలను కొందరు రైతులు వేరు చేసి స్వయంగా మొక్కల కోసం పాతగా.. వ్యాపారులు తక్కువ ధరల్లో నర్సరీలను తయారు చేశారు. ప్రస్తుతం కొబ్బరితోపాటు మొక్కలకు గిరాకీ రావడంతో రైతులకు, వ్యాపారులకు కొంత ఊరట లభించింది.

ఈ-పంట శతశాతం

2,04,500 ఎకరాల్లో వరిసాగు



క్షేత్ర పరిశీలనలో జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఈ-పంట నమోదు ప్రక్రియ శత శాతం పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. సెప్టెంబరు 15 నాటికి నమోదు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ గడువును నెలాఖరు వరకు పొడిగించింది. పశ్చిమలో 2.11 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా వివిధ కారణాలతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో అది 2,04,500 ఎకరాలకే పరిమితమైంది. ఈ-పంట నమోదు ఆధారంగా 1,08,000 మంది రైతులు 2,04,500 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేపట్టినట్లు వెల్లడైంది. దీనిపై ప్రస్తుతం జిల్లా అధికారులు క్షేత్ర పరిశీలన చేస్తున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు నష్ట పరిహారం, మద్దతు ధర, ప్రభుత్వ రాయితీలు, పథకాల వర్తింపునకు ఈ-పంట వివరాలే ఆధారం.

ఈ-కేవైసీ 97 శాతం.. ఈ-పంట నమోదు తర్వాత నిర్వహించే ఈ- కేవైసీ ప్రక్రియ 97 శాతం మేర పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. తణుకు, ఆచంట, అత్తిలి, తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలు వెనుకబడి ఉన్నాయి. 1.02 లక్షల మంది రైతుల నుంచి ఈకేవైసీ ద్వారా వేలిముద్రలు సేకరించారు. జిల్లా వ్యాప్తంగా 1,98,600 ఎకరాల్లో వరి సాగు చేసే రైతుల ఈకేవైసీ నమోదు ప్రక్రియ పూర్తయింది. మరో 5,900 ఎకరాలకు సంబంధించిన రైతుల నుంచి బయోమెట్రిక్ సేకరించాల్సి ఉంది. వీలైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఐబీబీఎఫ్ అధ్యక్షుడిగా రమేశ్‌కుమార్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఇండియన్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ (ఐబీబీఎఫ్) అధ్యక్షుడిగా ది ఆంధ్రా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి రమేశ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ వివరాలను పశ్చిమగోదావరి జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్‌కే ఖాసిం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐబీబీఎఫ్‌కు తెలుగు వ్యక్తి ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. రమేశ్ వద్ద శిక్షణ పొందిన పలువురు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు.

'భవిత' ఉపాధ్యాయులకు శిక్షణ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భవిత కేంద్రాల్లో బోధించే ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ తరగతులను భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. సమగ్ర శిక్షా ఏపీసీ పి.శ్యాంసుందర్, సహిత విద్య జిల్లా సమన్వయకర్త సీహెచ్ సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. బోధన సమయంలో విద్యార్థులతో వ్యవహరించాల్సిన తీరు, ఆప్యాయంగా పలకరించడం తదితర అంశాలపై రాష్ట్ర స్థాయి శిక్షణ బృందం సభ్యులు సూచనలు ఇచ్చారు.



బాల్యమిత్రుల ఆత్మీయ సమ్మేళనం

మొగల్తూరు, న్యూస్‌టుడే: భీమవరం లూథరన్ ఉన్నత పాఠశాలలో 1977లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం పేరుపాలెం బీచ్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆహ్లాదంగా గడిపారు. ఆత్మీయ కలయిక తృతీయ వార్షికోత్సవం సందర్భంగా పలు వృత్తులు, వివిధ హోదాల్లో ఉద్యోగ విరమణ చేసిన వారంతా కుటుంబ సభ్యులతో కలిసి సమావేశమయ్యారు. బాల్యంలోని మధుర స్మృతులు నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా సహచరులకు ఆత్మీయ సత్కారం చేశారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి దంపతులు, అగ్నిమాపక జిల్లా విశ్రాంత అధికారి ఎన్.సురేంద్ర ఆనంద్ దంపతులు, పలు ప్రభుత్వ శాఖల విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆహ్వాన కమిటీ కన్వీనరు బొండా రాంబాబు, కో కన్వీనర్ కారుమూరి భాస్కరరావు, అయిత వెంకట్రావు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను విస్మరించడం సరికాదు



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న ఫోరం ప్రతినిధులు

గునుపూడి, న్యూస్‌టుడే: జనాభాలో 18 శాతం ఉన్న వృద్ధుల సంక్షేమాన్ని విస్మరించడం సరికాదని సీనియర్ సిటిజన్స్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ (ఏపీ రాష్ట్ర వయోవృద్ధుల సంక్షేమ సంఘం అనుబంధ సంస్థ) ప్రతినిధులు నిరసన తెలిపారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా భీమవరంలోని శ్రీకృష్ణ దేవరాయ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఫోరం ప్రతినిధులు మాట్లాడారు. వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గతంలో కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి వృద్ధులను గౌరవించేవారని.. ఇప్పుడు ఆ సాంప్రదాయాన్ని విస్మరించడం విచారకరమని పేర్కొన్నారు. రైళ్లలో రాయితీలు పునరుద్ధరించాలని, ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పలు సమస్యలను తెలియజేస్తూ తహసీల్దారు రాంబాబుకు వినతిపత్రం అందించారు. ఫోరం ప్రతినిధులు మట్లపూడి సత్యనారాయణ, బోణం పాండురంగారావు, తాళ్లపూడి గాంధీ, చినమిల్లి నాయుడు, పెన్మెత్స రామకృష్ణంరాజు, ఇంటి లక్ష్మణరావు, కడియం ఈశ్వరరావు, పేరిచర్ల లక్ష్మణవర్మ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు కోసం మరో పోరాటం



దీక్షలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు మరోసారి పోరాటానికి సిద్ధంగా ఉన్నామని సీఐటీయూ, ఏఐటీయుసీ, టీయూసీసీ నాయకులు పేర్కొన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించవద్దంటూ భీమవరం ప్రకాశం చౌక్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. సీఐటీయూ నాయకులు జేఎన్వీ గోపాలన్, కోనాల భీమారావు, దండు శ్రీనివాసరాజు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించబోమని పాలకులు ప్రకటనలు చేస్తున్నా కార్మికులను తొలగించడం, బదిలీ చేయడం వంటి చర్యలు అనుమానాలకు తావిస్తున్నాయన్నారు. సీఐటీయూ నాయకుడు ఎం. ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంకెం సీతారాం, బీఎస్పీ సీనియర్ నాయకురాలు ఎస్తేరు రాణి, ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు కృష్ణమూర్తి, వ్యకాసం జిల్ల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ పేదల సంక్షేమ సంఘం నాయకులు ఎం. వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

నవ వధువు బలవన్మరణం

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: తల్లిదండ్రులను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకొని అయిదు నెలలు గడవకముందే నవ వధువు, మూడు నెలల గర్భిణి బలవన్మరణానికి పాల్పడిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని రాజీవ్ నగర్ కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా శివపురం గ్రామానికి చెందిన చల్ల కృష్ణ ప్రసాద్ తల్లిదండ్రులతో సహా 11 ఏళ్ల క్రితం పోచంపల్లికి వలస వచ్చి జీవనం సాగిస్తున్నారు. కృష్ణ ప్రసాద్ ఓ కిరాణ దుకాణంలో గుమస్తాగా పని చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా మీనవల్లూరు గ్రామానికి చెందిన శివపార్వతి (20) తల్లి కువైట్‌లో గృహ సహాయకురాలిగా పని చేయడానికి వెళ్లగా పోచంపల్లిలో ఉంటున్న ఆమె అమ్మమ్మ వద్దకు వచ్చారు. ఇక్కడే ఉంటూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. అప్పుడే పరిచయమైన కృష్ణప్రసాద్‌ను ఇష్టపడ్డారు. ఉన్నత చదువు నిమిత్తం శివపార్వతి తిరిగి సొంత గ్రామానికి వెళ్లగా.. కృష్ణ ప్రసాద్ కూడా అక్కడికి వెళ్లి పెద్దలకు తెలియకుండా వివాహం చేసుకున్నారు. దంపతులిద్దరూ పోచంపల్లికి వచ్చి ఇక్కడే ఉంటున్నారు. శివపార్వతి నెల తప్పడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ఆమె భర్త తల్లిదండ్రులతో గొడవలు జరిగాయి. ఉదయం 11 గంటలకు భర్త పని నిమిత్తం దుకాణానికి, మామ మగ్గం పని నిమిత్తం, అత్త అదే కాలనీలో ఉంటున్న తోటి కోడలు ఇంటికి వెళ్లారు. సాయంత్రం 4 గంటలకు అత్త ఇంటికి తిరిగి వచ్చే సరికి పడక గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని విగత జీవిగా ఉన్న కోడలును చూసి కేకలు వేశారు. ఇరుగు పొరుగు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతిపై వివరాలు తెలియాల్సి ఉంది.

వరద బాధితులకు సాయం



కలెక్టరు నాగరాణికి చెక్కు అందిస్తున్న ఇన్‌ఛార్జి తహసీల్దార్, ప్రధానోపాధ్యాయ సంఘం ప్రతినిధులు



ఎమ్మెల్యే రామాంజనేయులుకు విరాళాలు అందజేస్తున్న ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు, సుచిత్ర వైన్స్ నిర్వాహకులు

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండలంలో సేకరించిన వరద బాధితుల సాయం రూ. 3,00,232 చెక్కును మంగళవారం ఆచంట ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా పని చేసి బదిలీ అయిన సుగుణ సంధ్య కలెక్టరు నాగరాణికి అందించారు. ఆచంట ఛాంబర్ ఆఫ్ కామర్స్ రూ. 1,01,116, కరుగోరుమిల్లి గ్రామస్థులు రూ. 1,01,116, భీమలాపురానికి చెందిన చల్లా వెంకట సుబ్బారాయుడు రూ. 21,000, వల్లూరుకు చెందిన ఆరుమిల్లి రామేశ్వర స్వామి రూ. 30,000, ముప్పాల వెంకట సత్యనారాయణ రూ. 20,000, కడారి రామకృష్ణ రూ. 27,000 సాయం కలిపి ఈ మొత్తం అందించారు.

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు రూ. 1,00,245 చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. యలమంచిలి మండలం ఏనుగువానిలంక ఉన్నత పాఠశాల విద్యార్థులు రూ. 38,123, పెనుగొండ మండలం దేవ గ్రామంలో ఎస్ఎంబీటీఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూ. 10,154వేల చెక్కులను అందజేశారు.

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరానికి చెందిన ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు రూ. 1,50,116, సుచిత్ర వైన్స్ తరఫున రూ. లక్ష చొప్పున విరాళాలను ఎమ్మెల్యే రామాంజనేయులుకు మంగళవారం అందజేశారు.

బసవతారకం ఆస్పత్రిలో మహిళా రోగులకు ఉచిత కన్సల్టేషన్

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అక్టోబరు 1 నుంచి 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అక్టోబర్ నెలను రొమ్ము కాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్‌నం. 040- 23551235, 23550967లను సంప్రదించవచ్చని సూచించారు.

విధులు బహిష్కరించి నిరసన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది, పర్యవేక్షకులు మంగళవారం విధులు బహిష్కరించి భీమవరం ఎక్సైజ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. నూతన మద్యం విధానం అమలులో ఉపాధి కోల్పోతున్న తమకు ప్రభుత్వ శాఖల్లో అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. తమకు అనుకూలంగా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అక్టోబరు 1వ తేదీ నుంచి విధులకు హాజరు కాబోమని స్పష్టం చేశారు.

మద్యం తాగిన చోదకులకు జరిమానా

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం ఏఎస్ఆర్ నగర్ ప్రాంతంలో మద్యం తాగి వాహనం నడుపుతున్న ఇద్దరిని ఈ నెల 29న రెండో పట్టణ సీఐ జి.కాళీచరణ్ అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. వారిని మంగళవారం భీమవరం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

రూ.40 లక్షల విలువైన వాహనాలు స్వాధీనం



రికవరీ చేసిన ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, పోలీసు సిబ్బంది

గణపవరం, న్యూస్‌టుడే : అంతర్ జిల్లా ద్విచక్ర వాహనాల దొంగను గణపవరం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. గణపవరం పోలీస్ స్టేషన్‌లో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. కొయ్యలగూడెం మండలం గవరవరానికి చెందిన చప్పిడి ముసలయ్య, గణపవరం మండలం ముగ్గళ్లకు చెందిన శెట్టి చిన్నాలు చెడు వ్యసనాలకు బానిసయ్యారు. వీరిద్దరు ముఠాగా ఏర్పడి గుంటూరు, కృష్ణా, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో రూ. 40 లక్షల విలువైన 45 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను అపహరించారు. సెప్టెంబరు 23న గణపవరం పోలీసులు శెట్టి చిన్నాను అరెస్టు చేసి రూ. 22 లక్షల విలువైన 29 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని జైలుకు పంపారు. పరారీలో ఉన్న చప్పిడి ముసలయ్య కోసం గాలించగా మంగళవారం పోలీసులకు చిక్కాడు. అతన్ని అరెస్టు చేసి రూ. 18 లక్షల విలువైన 16 మోటారు సైకిళ్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. చోరీకి గురైన ద్విచక్ర వాహనాలు, ఆటోను రికవరీ చేయడంలో ప్రతిభ చూపిన గణపవరం ఎస్సై మణికుమార్, సిబ్బంది శంకర్, హేమసుందర్, కాంతయ్య, రత్నబాబు, సత్యనారాయణ, హోంగార్డు జగపతిబాబులను డీఎస్పీ అభినందించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 143 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

విదేశీ నగదు ఇస్తామని మోసం

* 24 గంటల్లోనే కేసు ఛేదన..
* నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

నరసాపురం, న్యూస్‌టుడే: ఒక వ్యక్తికి విదేశీ నోట్లు ఇస్తామని నమ్మించి మోసగించిన కేసును పోలీసులు 24 గంటల వ్యవధిలోనే ఛేదించారు. దీనికి సంబంధించి నరసాపురం డీఎస్పీ మురళీకృష్ణ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లికి చెందిన రాపాక చంద్రరావు గతంలో గల్ఫ్ వెళ్లి వచ్చారు. ఈ అనుభవంతో విదేశాల నుంచి వచ్చిన వారి వద్ద నుంచి విదేశీ కరెన్సీ నోట్లు, సెంటు సీసాలు, కళ్లజోళ్లు తదితర సామగ్రిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తుంటారు. ఇతని వ్యాపారం బాగా సాగుతుండటంతో అదే గ్రామానికి చెందిన గల్ఫ్ నుంచి వచ్చిన మేడిది వెంకటరెడ్డి కూడా ఇదే వ్యాపారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య వైరం ఏర్పడింది. దీంతో చంద్రరావు ఏలూరు జిల్లా కలిదిండి వెళ్లి అక్కడ వ్యాపారం చేస్తున్నారు. అక్కడ కూడా వ్యాపారం బాగుండటంతో అసూయ చెందిన వెంకటరెడ్డి అతని వ్యాపారాన్ని నిరోధించాలని కొంతమందితో కలిసి కుట్రపన్నారు. దీంట్లో భాగంగా ఆకుల ప్రభుతేజ, సాధనాల మణికంఠ సూర్యతేజ, భయ్యా హిమసాగర్ ఒక బృందంగా, కోరుకొండ గిరిబాబు, గంగరాజు, జవ్వాడి మలికిబాబు మరో బృందంగా ఏర్పడి చంద్రరావుపై దాడికి కుట్రపన్నారు. వారి పథకం ప్రకారం చంద్రరావుకు గత నెల 30న వెంకటరెడ్డి ఫోన్ చేసి తనవద్ద రూ. 2 లక్షల విదేశీ కరెన్సీ ఉందని, వాటిని విక్రయిస్తానని నమ్మబలికాడు. మొగల్తూరు పోలీసు స్టేషన్ పరిధి రాజుగారి తోట వద్దకు రావాలని చెప్పాడు. విదేశీ కరెన్సీ కోసం రూ. 2 లక్షల నగదు తీసుకుని చంద్రరావు వచ్చాడు. ప్రభు తేజ, మణికంఠ సూర్యతేజ, హిమసాగర్‌లు వచ్చి రూ. 2 లక్షల నగదు లాక్కుని చంద్రరావుపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో నరసాపురం గ్రామీణ సీఐ దుర్గాప్రసాద్, మొగల్తూరు ఎస్ఐ జి.వాసు సిబ్బందితో కలిసి లాడ్జిలు, ఇతర ప్రాంతాల్లో గాలించారు. నిందితులు ఏడుగురు పట్టణంలోని ఓ లాడ్జిలో ఉండగా గుర్తించి అరెస్టు చేసి రూ. 1.70 లక్షల నగదు, ఖతార్‌కు చెందిన రియాల్ నోట్లు పది, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా కేసును కేవలం 24 గంటల్లోనే ఛేదించిన పోలీసులు బృందాన్ని డీఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

* For the Information of Trade & Industry
* గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.35 పై॥

తణుకు ఆఫీసు: 08819-224254

భీమవరం

• భీమవరం • ఉండి

వయోవృద్ధుల న్యాయ సలహాలు


మాట్లాడుతున్న న్యాయమూర్తి ధనరాజ్

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: వయో వృద్ధులకు న్యాయపరమైన సలహాలతో పాటు అవసరమైతే మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని రెండవ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి న్యాయమూర్తి డి.ధనరాజు అన్నారు. తాడేరు రోడ్డులో ఉన్న వృద్ధాశ్రమాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. తల్లిదండ్రుల బాగోగులు చూడని బిడ్డలకు వారి ఆస్తులను అనుభవించే హక్కు లేదని పేర్కొన్నారు. భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యోహాను (న్యూటన్), ప్రధాన కార్యదర్శి ఎ.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలే లక్ష్య సాధనకు మార్గం


యువతుల నృత్య ప్రదర్శన

పాలకోడేరు, న్యూస్‌టుడే: పెన్నాడ వైట్ ఇంజినీరింగ్ కళాశాలలో తొలి ఏడాది విద్యార్థులకు స్వాగతోత్సవ వేడుక మంగళవారం సందడి వాతావరణంలో జరిగింది. పలువురు విద్యార్థులు నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. అనంతరం అధ్యాపకులు మాట్లాడుతూ పట్టుదలే లక్ష్య సాధనకు మార్గమని, ప్రతి విద్యార్థి చదువుతో పాటు అదనపు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ కొప్పర్తి సురేష్, హెచ్‌వోడీలు మంగతాయారు, రాగిణి, మనోహర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరునికి అభిషేకాలు

పాలకోడేరు, న్యూస్‌టుడే: మాసశివరాత్రి సందర్భంగా మోగల్లులోని భద్రకాళీ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం పుష్పాలతో స్వామిని అలంకరించి ప్రధాన అర్చకుడు పెద్దాడ నారాయణశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు.

దసరా ఉత్సవాలకు ముస్తాబు


అలంకరణలో సోమేశ్వరస్వామి

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: శరన్నవ రాత్రి మహోత్సవాలకు పట్టణంలో ఆలయాలు ముస్తాబయ్యాయి. పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్దనస్వామి ఆలయంలో 3న ఉదయం 7.30 గంటలకు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు దంపతులు కలశ స్థాపన చేసి మహోత్సవాలను ప్రారంభిస్తారని ఈవో డి.రామకృష్ణంరాజు మంగళవారం తెలిపారు. గునుపూడి గ్రామ దేవత ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ, శ్రీరామపురం కూడలిలో కనకదుర్గ, బుధవారం మార్కెట్ వద్ద కామాక్షి దేవి, భీమేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవార్లను 9 రోజుల పాటు వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, ఈవోలు తెలిపారు.

ఊరూరా.. అక్రమార్కులు!

✹ జిల్లా కేంద్రం చుట్టూ అనధికార లేఅవుట్లు ✹ ఆక్రమణల చెరలో ప్రభుత్వ స్థలాలు

శృంగవృక్షం, గొల్లలకోడేరు (పాలకోడేరు), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణాన్ని ఆనుకుని ఉన్న పాలకోడేరు మండలంలోని పలు గ్రామాల్లో అనధికార లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు చెప్పిందే శాసనంగా సాగడంలో ఎలాంటి అనుమతులు లేని లేఅవుట్లలోనూ ఇళ్ల నిర్మాణాలకు అధికారులు అనుమతులు ఇచ్చారనే విమర్శలు ఉన్నాయి. ఒక్క శృంగవృక్షం పంచాయతీలోనే 25 అనధికార లేఅవుట్లు ఉన్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ గ్రామంలో రహదారి పక్కన సెంటు స్థలం రూ.10 లక్షల వరకు ధర పలుకుతుండగా, లోపల రూ.3 లక్షల నుంచి రూ. 5లక్షల వరకు ఉంది. దీంతో అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి లేవుట్లలో కలిపేసుకున్నారు. సాధారణ ప్రజలు ఇలాంటి స్థలాలు కొనుగోలు చేసి మోసపోతున్నారు. ఈ ప్రాంతంలో అనధికార లేఅవుట్ల వివరాలు సేకరిస్తున్నామని, వాటి యజమానులకు నోటీసులు జారీ చేస్తామని పంచాయతీ కార్యదర్శి సుభాషిణి తెలిపారు.

✹ పాలకోడేరు మండలం శృంగవృక్షంలో అనధికార లేఅవుట్ వద్ద పెట్టిన ఫ్లెక్సీ ఇది. జిల్లా అధికారులు నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన రహదారి పక్కన ఆర్అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి వేసిన ఈ లేఅవుట్‌లో దర్జాగా జాగాలు విక్రయిస్తున్నా పట్టించుకొనే నాథులే లేరు. ఈ గ్రామంలో 27 లేవుట్లు ఉండగా వాటిలో రెండింటికి మాత్రమే అనుమతులు ఉన్నాయి. మిగిలినవన్నీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా స్థలాల విక్రయాలు, ఇళ్ల నిర్మాణాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి.



విలువైన జాగాలు మాయం

పాలకోడేరు మండలం గొల్లలకోడేరులో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, అక్రమ కట్టడాలకు హద్దు లేకుండా పోయింది. గతంలో అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితం కావడంతో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న విలువైన ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలు వెలిశాయి. అప్పటి నేతల పైరవీలతో ఎలాంటి పరిశీలన లేకుండానే అక్రమ కట్టడాలకు అధికారులు పన్నులు విధించడంతో పాటు విద్యుత్తు కనెక్షన్లు కూడా ఇచ్చారు. ఈ గ్రామంలో ప్రధాన కూడలిలో సైతం రహదారికి ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోవడంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నామని కార్యదర్శి నాగేంద్ర కుమార్ తెలిపారు.


గొల్లలకోడేరు ప్రధాన సెంటర్‌లో రహదారి పక్కన అక్రమ కట్టడాలు

పరివర్తకాలపై పాదుల తొలగింపు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులో ఆజాద్ చెరువు గట్టు వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం పక్కన రహదారిలో విద్యుత్తు పరివర్తకాలు, పెద్దింట్లమ్మ గుడి వీధిలో స్తంభాలకు పాదులు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారిన తీరుపై 'ఈనాడు- మేమున్నాం.. మీకు తోడుగా'లో మంగళవారం ప్రచురితమైన వార్తకు ఆ శాఖ ఏఈ ప్రదీప్ స్పందించారు. సిబ్బందితో పాదులను తొలగింపు పనులు చేశారు.

చకచకా పింఛన్ల పంపిణీ


నగదు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీని మంగళవారం ఉదయం 5.30 గంటల నుంచే ప్రారంభించినట్లు ఎంపీడీవో ఎన్.మురళీగంగాధరరావు తెలిపారు. తొలిరోజు 95 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు తెలిపారు. గొల్లలకోడేరులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో తెదేపా నాయకులు కమ్మిల రాంబాబు, కామన రాంబాబు, శలా మల్లేశ్వరరావు, యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతో స్వచ్ఛత

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: భీమవరం పట్టణ పరిధి బీసీ కాలనీలో లబ్ధిదారులకు పింఛన్ల సొమ్మును తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రజా భాగస్వామ్యంతోనే సంపూర్ణ స్వచ్ఛత సాధ్యమవుతుందన్నారు. తెదేపా పట్టణాధ్యక్షుడు యిందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, ప్రధాన కార్యదర్శి గూడూరి సుబ్బారావు, జనసేన వార్డు ఇన్‌ఛార్జి కటికల పల్లారావు, నాయకులు బొక్కా శ్రీనివాస్, బొల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


పింఛన్ల నగదు పంపిణీ చేస్తున్న తోట సీతారామలక్ష్మి

అన్ని గ్రామాలకు స్వచ్ఛమైన నీరు


పింఛన్లు అందజేస్తున్న రఘురామకృష్ణరాజు, ఏపీఐఐసీ ఛైర్మన్ రామరాజు

కోలమూరు (ఉండి), న్యూస్‌టుడే: అన్ని గ్రామాలకు డిసెంబరు నెలాఖరు నాటికి స్వచ్ఛమైన తాగునీరు అందించే దిశగా కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు తెలిపారు. కోలమూరులో ఉప సర్పంచి నడింపల్లి రామకృష్ణంరాజు అధ్యక్షతన మంగళవారం జరిగిన సభలో ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజుతో కలిసి ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. యండగండి నుంచి వచ్చే పంట కాలువలో ఆక్వా చెరువుల్లో వ్యర్థ జలాలు కలుస్తుండటంతో స్వచ్ఛమైన నీరందటంలేదని భాజపా పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వచ్చే దీపావళి నాటికి కోలమూరుకు స్వచ్ఛమైన నీరు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, తెదేపా నాయకులు కరిమెరక నాగరాజు, పేరిచర్ల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

ఉండి, న్యూస్‌టుడే: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఎమ్మెల్యే రఘు రామకృష్ణరాజు ఆదేశించారు. ఇటీవల రహదారి ప్రమాదంలో గాయపడిన కోలమూరు వాసి విన్నకోట మణికంఠను ఆయనతో పాటు ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, పలువురు నాయకులు మంగళవారం పరామర్శించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.


ఆకివీడు: సమాజ సేవకులను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

వృద్ధుల సంక్షేమం సామాజిక బాధ్యత

ఆకివీడు, న్యూస్‌టుడే: వృద్ధుల అవసరాలను గుర్తించి సేవలందిచాలని.. వారి సంక్షేమాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని ఆకివీడులోని లయన్స్‌క్లబ్ భవనంలో 'అన్నదాత సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం', లయన్స్ క్లబ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆకివీడు లయన్స్ మెడికల్ ట్రస్ట్ సహకారంతో రూ.40 వేలు విలువైన మందులను వృద్ధులకు ఉచితంగా అందజేశారు. లక్ష్మీ ఆసుపత్రి వైద్యులు నవీన్, కవిత సౌజన్యంతో 120 మందికి దుప్పట్లు అందజేశారు. అనంతరం తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు, సూర్యనారాయణ, చంద్రశేఖర్, సత్యనారాయణ తదితర సమాజ సేవకులను సత్కరించారు.

ఉప్పులూరు (ఉండి), న్యూస్‌టుడే: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో ఉప్పులూరు గ్రామంలో వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇద్దరు వృద్ధులను సత్కరించి పెద్దల గొప్పతనాన్ని వివరించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి గాదిరాజు రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కొరతతో ఇబ్బందులు


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నిర్మాణ కార్మికులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఇసుక లభ్యత పూర్తిస్థాయిలో లేక పోవడంతో ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని భీమవరం తాలూకా తాపీ పనివార్ల సంఘం నాయకులు వాపోయారు. ఆ సంఘం అధ్యక్షుడు మెర్ల సత్యనారాయణ, కార్యదర్శి కటకంశెట్టి ఏడుకొండలు తదితరులు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులును మంగళవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు.

ఎక్సైజ్ సీఐగా శ్రీనివాసరావు



ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు ఎక్సైజ్ సీఐగా ఎం.శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏలూరు (డీటీఎఫ్)లో పనిచేసిన ఆయన బదిలీపై ఆకివీడు వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేసిన కాత్యాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు బదిలీ అయ్యారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

పాలకోడేరు, ఉండి, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి పోటీల్లో మోగల్లు, ఎన్నార్పీ అగ్రహారం జిల్లా జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. సోమవారం ఏలూరులో జరిగిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఈ పాఠశాలల విద్యార్థులు రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు త్రినాథ్, ఎంవీ సత్యనారాయణ తెలిపారు. అండర్-17 విభాగంలో ఆర్.మానస, పి.తరుణ్, జి.విజయభాస్కర్, ఎం.హర్షిత దుర్గ, ఎం.శ్యామ్‌కుమార్, కె.మహాలక్ష్మి, ఎల్‌జే ప్రతిభ, పి.సురేఖ, పి.చంద్రశేఖర్, అండర్-14 విభాగంలో ఎం.నాగేంద్రబాబు, వి.యశ్వంత్‌కుమార్, జి.సుభద్ర ఎంపికైనట్లు తెలిపారు. మంగళవారం ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

నివాసాల మధ్య వ్యర్థాలు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఊరి చివరి వేయాల్సిన వ్యర్థాలను రాత్రికి రాత్రి ఇళ్ల ముందు వేసి వెళ్లిపోతున్నారని భీమవరం పరిధిలోని వంశీకృష్ణనగర్ వాసులు వాపోతున్నారు. కాస్మోపాలిటన్ క్లబ్ పార్కు దాటాక ఉండిరోడ్డుకు వెళ్లే మార్గంలో ఒక చోట ఇళ్ల ముందు చెత్తను కుప్పలుగా వేయడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీపాన ఉన్న పురపాలక ఖాళీస్థలంలోనూ చెత్త వేయడంతో వాననీరు నిలిచిపోయి ఆ ప్రాంతం మడుగులా మారిపోయింది. సమస్యను స్థానిక సచివాలయ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తే అక్కడ చెత్త ఎవరు వేస్తున్నారో తమకు తెలియదని చెబుతున్నారని స్థానికుడు లక్ష్మీపతిరాజు వాపోయారు. ఈ అంశంపై స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణ స్పందిస్తూ వెంటనే చెత్త తొలగిచేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.


వంశీకృష్ణనగర్‌లో ఇంటి ముందు వేసిన చెత్త

ప్రయాణమంటే హడలే..!

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: భీమవరం రెండో పట్టణ పరిధహలో పలు రహదారులు ఇప్పటికే అధ్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా మరింత దారుణంగా తయారవుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు బలుసుమూడి, నెహ్రూపేట, శ్రీరాంపురం తదితర ప్రాంతాల్లో రోడ్లు ఛిద్రం కావడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం గుంతలు పూడ్చించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


నెహ్రూపేటలో రోడ్డుపై భారీ గుంత

గాంధీ ఆశయ సాధనకు కృషి

వీరవాసరం, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని వీరవాసరంలోని ఎస్ఎంబీటీఏవీ అండ్ ఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల ఆచార్యుడు వలవల నరసింహారావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యాపకులు మాట్లాడుతూ గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: గాంధీని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారక నిధి ఛైర్మన్, సీనియర్ ఐపీఎస్ అధికారి గాంధీ పీసీ ఖాజా పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని ఎస్ఆర్‌కేఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఉపాధి పనులపై గ్రామ సభలు

ఉండి, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పనులకు అంచనాల రూపకల్పనకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రవీంద్ర తెలిపారు. 15న ఆరేడు, కలిగొట్ల గ్రామాల్లో, 16న కోలమూరు, పాములపర్రు, 17న పాందువ్వ, ఉప్పులూరు, 18న యండగండి, ఉణుదుర్రు, 19న చిలుకూరు, మహదేవపట్నం, 21న ఎన్నార్పీఅగ్రహారం, వెలివర్రు, 22న వాండ్రం, చినపుల్లేరు, 23న పెదపుల్లేరు, చెరుకువాడ, 24న కలిసిపూడి, అర్తమూరు, 25న ఉండి గ్రామాల్లో సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ప్రజా ప్రతినిధులకు నేడు సత్కారం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను భీమవరం అల్లూరి సీతారామరాజు సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం సత్కరించనున్నట్లు ఆ సమితి అధ్యక్ష, కార్యదర్శులు గాదిరాజు సుబ్బరాజు, సీహెచ్. సుబ్రమహ్మణ్యంరాజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, భీమవరం, ఉండి ఎమ్మెల్యేలు రామాంజనేయులు, రఘురామకృష్ణంరాజు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజులు పాల్గొంటారని పేర్కొన్నారు.

వినూత్న ఆలోచనలే ఆవిష్కరణలకు మూలం


జిల్లా స్థాయికి ఎంపికైన చెరుకువాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు

వీరవాసరం, న్యూస్‌టుడే: వినూత్న ఆలోచనలే ఆవిష్కరణలకు మూలమని, విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న విజ్ఞానాన్ని నిజ జీవితంలో అన్వయించుకొంటూ సృజనాత్మకతకు పదును పెట్టాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి మల్లుల శ్రీనివాస్ అన్నారు. వీరసవారం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముఖి పోటీలు నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు.

ఉండి, న్యూస్‌టుడే: ఉండి ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక మండల కన్వీనర్ గోశాల సుకుమార్ ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. చెరుకువాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు చెకుముకి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయి చెకుముకి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. వీరిని మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలో చింతలపాటి బాపిరాజు స్మారకోన్నత పాఠశాల, కాళ్ల ఉన్నత పాఠశాలల్లో చెకుముకి మండల స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 27న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు చింతపల్లి ప్రసాదరావు, కన్వీనర్ రేపాక వెంకన్నబాబు తెలిపారు.

ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు


మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: భీమవరం అభివృద్ధికి అందరూ సహకరించాలని సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ సంచుల నియంత్రణకు త్వరలో కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నిర్దేశించిన ప్రాంతాల్లోనే వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దుకాణాలు, షాపింగ్ కాంప్లెక్స్‌ల వద్ద చెత్త వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హోటళ్లలోని ఆహార పదార్థాల్లో హానికర రంగులు వినియోగిస్తే సహించేది లేదన్నారు. ఈ నిబంధనలను 15 రోజుల్లో అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా ఆహార భద్రతా తనిఖీ అధికారి ఏఎస్ఆర్ రెడ్డి, డీఎస్‌వో సరోజ, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆరోగ్యంగా జీవించడానికి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలని తహసీల్దారు ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు ఆకివీడు శాఖ ఆధ్వర్యంలో ఆకివీడు రైల్వే స్టేషన్ ప్రాంగణం, పరిసర ప్రాంతాలను మంగళవారం శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దారు ప్రారంభించి మాట్లాడారు.

భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	దేవర
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	సత్యం సుందరం
నటరాజ్	------
కిషోర్ స్క్రీన్ 1	మత్తువదలరా 2
కిషోర్ స్క్రీన్ 2	సరిపోదా శనివారం
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	దేవర
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	సత్యం సుందరం
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	------
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4	------
విజయలక్ష్మి స్క్రీన్ 1	కళింగ

వ్యభిచార గృహంపై దాడి

కొవ్వాడ (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలం కొవ్వాడ పంచాయతీ పరిధి కొవ్వాడపుంతలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై దాడి చేసినట్లు సీఐ బి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఒక మహిళను అదుపులోకి తీసుకుని విజయవాడ ఉజ్వల హోమ్‌కు తరలించినట్లు వెల్లడించారు. వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న దంపతులు ఆల్బర్ట్ సెల్వకని, వెంకటలక్ష్మిలను కోర్టులో హాజరుపరిచి తణుకు సబ్‌జైలుకు తరలించినట్లు తెలిపారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

కొవ్వాడ అన్నవరం (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: ఇక్కడ మద్యం ఎందుకు తాగుతున్నారని అడిగినందుకు తనపై దాడి చేసి గాయపరిచారంటూ కొవ్వాడకు చెందిన తాళ్లూరి దినేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తాళ్లూరి ఆనందబాబు, వెస్లీలపై కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ మహేశ్ తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలో నరసయ్య అగ్రహారానికి చెందిన కె.మణికంఠ (32) గడ్డి మందు తాగి మృతి చెందినట్లు భీమవరం వన్‌టౌన్ ఏఎస్సై రామకృష్ణ మంగళవారం తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న మణికంఠ సోమవారం గడ్డి మందు తాగడంతో స్థానికులు చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అతడిని ఏలూరు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అతడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

పాలకోడేరు, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నట్లు పాలకోడేరుకు చెందిన నూతంగి ప్రియాంక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్తమామలపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు రైటర్ ఎస్.అజరయ్య తెలిపారు.

దిర్సుమర్రు (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: అదనపు కట్నం వేధింపులపై భీమవరం మండలం దిర్సుమర్రుకు చెందిన దొంగ లక్ష్మీదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అతడి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి ఎస్సై వీర్రాజు తెలిపారు.

వాహనదారుడికి గాయాలు

ఉండి, న్యూస్‌టుడే: ఉండి పెట్రోలు బంకు సమీపాన జాతీయ రహదారిపై రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. భీమవరం వైపు వెళ్తున్న బస్సు.. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడ్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడు గాయపడగా అతడిని భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఉండి పోలీసులు తెలిపారు.

ఏఎంసీ అభివృద్ధికి రూ.23 లక్షలతో ప్రతిపాదనలు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.23 లక్షల నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సూచనలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఏఎంసీ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ ఐ.చాముండేశ్వరి తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని చిట్టవరం, దారతిప్ప, జగన్నాథపురం, వెంప గ్రామాల్లో నిర్వహిస్తున్న చెక్ పోస్టుల ద్వారా ఏఎంసీకి ఏడాదికి సెస్ రూపంలో రూ.1.41 కోట్లు వసూలు చేయాలని లక్ష్యం కాగా ఇప్పటికే చేరుకున్నామన్నారు. ఇప్పటి వరకు 33 శాతం పన్ను వసూలైందన్నారు. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పన్ను సొమ్ము మార్చి నెల ఇరు నాటికి వసూలు చేసేందుకు చర్యలు చేపడతామని ఆమె పేర్కొన్నారు.

నాణ్యమైన సేవలు అందించాలి: జేసీ


సూచనలిస్తున్న రాహుల్ కుమార్ రెడ్డి

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిరుపేదలకు నాణ్యమైన సేవలు అందించాలని సంయుక్త కలెక్టర్(జేసీ) పి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. పాలకొల్లు 9వ వార్డులో చౌకధరల దుకాణాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ కాటాలతో పాటు ఎంతమందికి పంపిణీ చేశారో చూశారు. పింఛన్ల పంపిణీ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.దుర్గా కిశోర్, మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి, పట్టణ ప్రణాళిక అధికారి వీర బ్రహ్మం పాల్గొన్నారు.

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: పూలపల్లి ప్రధాన రహదారి చెత్త పేరుకుపోయింది. దీంతో ప్లాస్టిక్ సంచులు వాహన చోదకులపై పడుతున్నాయి. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. **- మణికంఠ, పూలపల్లి**

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందితో చెత్త తీయిస్తాం. **- లింగం సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి, పూలపల్లి**

పెనుగొండ, న్యూస్‌టుడే

సమస్య: చెరుకువాడ అంబేడ్కర్ కాలనీలో నాలుగు వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి. **- ఎస్.వరబ్రహ్మం, పెనుగొండ**

సమాధానం: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- టి.రత్నాకరరావు, పంచాయతీ కార్యదర్శి, పెనుగొండ**

అన్నదాతలకు అండగా అడుగులు

'పొలం పిలుస్తోంది' పేరుతో క్షేత్ర స్థాయి కార్యక్రమం

మార్టేరు, పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే

వైకాపా పాలనలో కీలకమైన వ్యవసాయ శాఖ కార్యక్రమాలు గాడి తప్పాయి. అన్నదాతలకు సాగులో మెలకువల తెలిపేందుకు నిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమాలు సైతం మొక్కుబడి తంతుగా మార్చేశారు. ఈ పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వ్యవసాయ కార్యక్రమాలను చక్కదిద్దే చర్యలు చేపట్టింది. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులను రైతుల చెంతకు పంపి వారికి సాగులో సలహాలు, సూచనలు అందిస్తే మేలు జరుగుతుందని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు 'పొలం పిలుస్తోంది' పేరున ప్రారంభించి కార్యక్రమం ద్వారా సంబంధిత శాఖాధికారులంతా పొలం బాట పట్టారు. సాగు విషయాలపై అవగాహన కల్పించడమే కాక పొలాలను పరిశీలించి లోటుపాట్లు గుర్తిస్తున్నారు. రైతులు చేపట్టాల్సిన చర్యలను అప్పటికప్పుడే వివరించి వారిని అప్రమత్తం చేస్తున్నారు.

మండలాలు	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	రైతుల సంఖ్య
పెనుగొండ	5073	5856
పెనుమంట్ర	5506	7126
పోడూరు	6205	7438
ఆచంట	4498	7393
పాలకొల్లు	4618	6207
యలమంచిలి	3245	4697
మొగల్తూరు	1018	869
నరసాపురం	5559	5682


రైతుకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారి జ్యోషిలా

ఈ పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రతి మంగళ, బుధవారాల్లో నిర్వహిస్తున్నారు. ఈ రెండు రోజులు కచ్చితంగా వ్యవసాయ, అనుబంధ శాఖ అధికారులతో పాటు శాస్త్రవేత్తలు సైతం పొలం బాట పట్టాలి. ఆయా పంటలపై రైతుల మధ్య చర్చ నడిపించాలి. నూతన వరి వంగడాలు, యంత్ర పరికరాలు, ఇతర సమాచారాన్ని రైతులకు వివరించాలి. వాతావరణ మార్పులు, ఎదురయ్యే చీడపీడల గురించి చైతన్య పర్చాలి. ముఖ్యంగా తక్కువ ఖర్చుతో అధిక ఉత్పత్తి, ఎక్కువ నికర ఆదాయం దిశగా రైతుల అడుగులు వేసేలా ఈ కార్యక్రమం సాగాలని ప్రభుత్వం సూచించింది.

ప్రతి మంగళ, బుధవారాల్లో...

రైతు వద్దకే రావడం ఆనందం



ఈ కార్యక్రమంలో భాగంగా తెగుళ్లు వచ్చే అవకాశం ఉంటే వాడాల్సిన పురుగుమందులు గురించి వివరిస్తున్నారు. ఎరువులు, పురుగు మందులు ఎంతెంత మోతాదులో వాడాలో చెప్పడం ఆనందంగా ఉంది. ఉపయోగపడే సమాచారమే కాక పథకాల గురించి చెబుతున్నారు. **- టి.జోగేశ్వరరావు, రైతు, వడలి**

అవగాహన కల్పించడంతో మేలు




సాగు పరమైన అన్ని విషయాలపై రైతులు పరిజ్ఞానం ఉండదు. ఆ విషయాలపై అవగాహన కల్పించడం ఎంతో బాగుంది. పొలంలో పంట పరిస్థితి చూసి ఎటువంటి చర్యలు తీసుకోవాలో చెప్పడంతో రైతు సైతం ధైర్యంగా ముందుకెళ్తాడు. **- బి.శ్రీనివాసరావు, రైతు, కోమటిచెర్వు**

సోమేశ్వరుడికి అభిషేకాలు

జుత్తిగ(పెనుమంట్ర), న్యూస్‌టుడే: జుత్తిగలోని ఉమా వాసుకీ రవిసోమేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారికి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. మాస శివరాత్రి పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో పార్వతీ అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను వివిధ ప్రాంతాల వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. పూజాభిషేకాల అనంతరం స్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఘనంగా అల్లు రామలింగయ్య జయంతి

పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సినీ నటుడు అల్లు రామలింగయ్య జయంతి వేడుకలను అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టాక్సీ స్టాండ్ కూడలి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాటక రంగం నుంచి సినీ పరిశ్రమకు వెళ్లి అక్కడ గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో తులా రామలింగేశ్వరరావు, చేబ్రోలు కృష్ణమోహన్, శిడగం సురేంద్ర, కాపిశెట్టి పెదకాపు తదితరులు ఉన్నారు.


శ్రీవర్షిణి గీసిన చిత్రం


కలెక్టర్ నుంచి బహుమతి అందుకుంటున్న విద్యార్థి

గాంధీతత్వమే బహుమతి!

యలమంచిలి, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా 'గాంధీతత్వం.. నేటి భారతం' అనే అంశంపై మేడపాడు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆకుమర్తి శ్రీవర్షిణి గీసిన చిత్రం బహుమతికి ఎంపికైంది. జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి పొందగా, మంగళవారం కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా బహుమతిని అందించారు.

గాంధీ వ్యక్తి కాదు... మహాశక్తి

నరసాపురం, న్యూస్‌టుడే: జాతి పిత మహాత్మా గాంధీ ఒక వ్యక్తి కాదని, మహాశక్తి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. వైఎంసీలోని గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో గాంధీ జయంతి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న తహసీల్దారు రాజరాజేశ్వరి, గాంధేయవాది వాడ్రేవు సుందరరావు తదితరులు మాట్లాడారు. పట్టణంలో శాంతి ప్రదర్శన చేశారు. ఇటీవల ఏర్పాటు చేసిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు, కోశాధికారి పోలిశెట్టి శ్రీరఘురామారావు, విశ్రాంత శాస్త్రవేత్త ఆర్‌వీ సుబ్బారావు, కళాశాల డీన్ గంధం శ్రీరామకృష్ణ, గాంధీ అధ్యయన కేంద్రం డైరెక్టర్ పీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ


నగదు అందజేస్తున్న నాయకర్, రామరాజు తదితరులు

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు సంక్షేమ పింఛన్ల నగదును మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదరికం నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. వారి వెంట పురపాలక సంఘ కమిషనర్ అంజయ్య, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

97 శాతం పూర్తి.. **పెనుగొండ, న్యూస్‌టుడే:** మండలంలో పెనుగొండ, వడలి తదితర గ్రామాల్లో మంగళవారం సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ సంక్షేమ పింఛన్లను పంపిణీ చేశారు. ఈవోపీఆర్డీ సీహెచ్‌ఎస్వీ రెడ్డి మాట్లాడుతూ మండలంలో 15 గ్రామాల్లో 97 శాతం ఎన్టీఆర్ సంక్షేమ పింఛన్లు పంపిణీ చేశామన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తికి.. **పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే:** ములపర్రు గ్రామానికి చెందిన వెంకన్న కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో తలకు ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందుతున్నాడు. మంగళవారం అధికారులు కాకినాడ వెళ్లి ఎన్టీఆర్ సామాజిక పింఛన్‌ను ఆయనకు అందజేశారు. ఎన్టీఆర్ సామాజిక పింఛన్ తమకు భరోసానిచ్చిందని బాధితులు తెలిపారు.

ఏపీఐఐసీ అధ్యక్షుడికి సత్కారం


రామరాజుకు అభినందనలు తెలుపుతున్న పితాని

పోడూరు, న్యూస్‌టుడే: ఏపీ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ(ఏపీఐఐసీ) అధ్యక్షుడు మంతెన రామరాజును మంగళవారం మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సత్కరించారు. కొమ్ముచిక్కాలలో మర్యాదపూర్వకంగా కలిసిన రామరాజుకు ఎమ్మెల్యే పితాని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారిని అధిష్ఠానం ఎన్నడూ విస్మరించదనడానికి రామరాజు నిదర్శనమన్నారు. అనంతరం రామరాజు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్టా రాంబాబు, వీరవల్లి శ్రీనివాస్, జుత్తిగ శ్రీనివాస్, చిన్నంశెట్టి హరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నారాయణ మంత్ర పఠనం

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూలో కల్తీకి నిరసనగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు పాలకొల్లు పట్టణ జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం సంఘీభావం తెలిపారు. సుబ్బారాయుడి గుడి కూడలిలో ఉన్న రామాలయంలో పూజలు చేశారు. ఓం నమో నారాయణాయ అని మంత్రం పఠనం చేశారు. శిడగం సురేంద్ర, తులా రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ, న్యూస్‌టుడే: స్థానిక లింగాల వీధి కోదండ రామాలయం, పెనుగొండ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం జనసేన నాయకులు, వీర మహిళలు పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో ఓం నమో నారాయణాయ మంత్రాన్ని 1008 సార్లు పఠించారు. కొండవీటి శ్రీనివాసరావు, శివ తదితరులు పాల్గొన్నారు.


పెనుగొండ: వేంకన్న సన్నిధిలో మంత్రాన్ని పఠిస్తున్న జన సైనికులు

ఆచంట, న్యూస్‌టుడే: వల్లూరులో గోవింద నామాలతో ప్రదర్శన చేశారు. జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్, ఉప ఎంపీపీ టి.శ్రీనివాసరావు తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వాడటం అపచారమని ఆవేదన వ్యక్తం చేశారు.

అవసరమైనవారికి ఉచిత న్యాయ సహాయం

నరసాపురం, న్యూస్‌టుడే: అవసరమైన వృద్ధులు ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చని పలువురు న్యాయవాదులు తెలిపారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బొండమ్మ వృద్ధాశ్రమాన్ని మండల న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు మంగళవారం సందర్శించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ, దానయ్య నాయుడు, ఫణికర్, ఆశ్రమ నిర్వాహకుడు రహీమ్ పాల్గొన్నారు.

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వంగా నరసింహారావు, ప్రధాన కార్యదర్శి జీఎస్‌ఎన్ మూర్తి, కార్యదర్శి వెంకటరత్నం, నరసింహారావు, కొల్లి నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఇలా అయితే ఎట్టా...!



పరిశుభ్రతతో ప్రజలకు ఆదర్శంగా చూపించాల్సిన ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాలే అధ్వానంగా ఉన్నాయి. పోడూరు మండలం తూర్పుపాలెం వెల్‌నెస్ సెంటర్, రైతు సేవా కేంద్రం చెంత పరిస్థితిని చూసి అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. పక్కపక్కనే ఉన్న ఈ కార్యాలయాల ప్రాంగణంలో పచ్చిగడ్డి, ఇతర మొక్కలు దట్టంగా పెరిగాయి. దీంతో విష సర్పాలు, కీటకాలు సంచరించే అవకాశం ఉండటంతో వైద్య సేవల కోసం వచ్చే వారితో పాటు రైతులకు రక్షణ కరవైంది. ఆర్‌ఎస్‌కే ప్రధాన ద్వారం ఇరువైపులా మరీ ఘోరంగా ఉంది. **- పోడూరు, న్యూస్‌టుడే**

నిర్లక్ష్యం చెంత డ్వాక్రా భవనం



నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: మల్లవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమీపంలోని రక్షిత మంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంకును ఆనుకుని 2016 సంవత్సరంలో నిర్మించిన డ్వాక్రా భవనం తుప్పల మధ్య నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ప్రస్తుత భవనంలో డ్వాక్రా మహిళల ఆర్థిక స్వావలంబనకు సంబంధించిన కార్యకలాపాలు జరగడం లేదని స్థానికులు తెలిపారు. తుప్పల మధ్య నిరుపయోగంగా ఉన్న డ్వాక్రా స్వయం సహాయక సంఘం భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలమై.. ప్రమాదకరంగా మారి...!



పెనుమంట్ర మండలం వెలగలవారిపాలెంలో గోస్తనీ - వేల్పూరు కాలువపై నిర్మించిన ఎల్ ఆకారం వంతెన శిథిలమైంది. స్థానిక గ్రామం నుంచి పంట పొలాలను కలుపుతూ పెనుమంట్ర వైపు వెళ్లేందుకు ఈ మార్గంలో ఇదీ ఉంది. కొన్నేళ్లుగా నిర్వహణ లేక ఎక్కడికక్కడే ధ్వంసమవుతోంది. ఎక్కువ విస్తీర్ణంలో రక్షణ గోడలు విరిగిపోగా, మరికొన్ని చోట్ల ఊచలు బయటకు వచ్చి ప్రమాదకరంగా మారాయి. వంతెన రహదారి సైతం అంతంత మాత్రంగా ఉంది. ఈ విషయమై పీఆర్ ఇన్‌ఛార్జి ఏఈ ఏడుకొండలు మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. **- న్యూస్‌టుడే, వెలగలవారిపాలెం(పెనుమంట్ర)**

'పొలం పిలుస్తోంది' వాయిదా

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: చినమామిడిపల్లిలో మంగళవారం జరగాల్సిన పొలం పిలుస్తోంది కార్యక్రమం వాయిదా పడింది. ఈ కార్యక్రమం గురువారం నిర్వహిస్తామని, రైతులు గమనించాలని ఏడీఏ అనిల్ కుమారి పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

యలమంచిలి, న్యూస్‌టుడే: మండలంలోని అబ్బిరాజుపాలేనికి చెందిన ఎన్నాబత్తుల నరసింహమూర్తి(47) సెప్టెంబర్ 20వ తేదీ నుంచి కనబడటం లేదని ఆయన కుటుంబ సభ్యులు యలమంచిలి పోలీసు స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన వ్యక్తికి వరుసకు సోదరుడైన లక్ష్మణస్వామి ఈ ఫిర్యాదు ఇచ్చారని యలమంచిలి ఎస్సై గురయ్య తెలిపారు.

మహిళ.. **పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:** పాలకొల్లు మండలం పెదమామిడిపల్లికి చెందిన ఒక మహిళ అదృశ్యమైంది. పాలకొల్లు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండి సుభద్ర గత నెల 29న ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఆమె కుమారుడు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి కేసులో అరెస్టు.. **నరసాపురం, న్యూస్‌టుడే:** గంజాయి రవాణా కేసులో తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని మంగళవారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ బి.యాదగిరి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రెండు కిలోల గంజాయి కలిగి ఉన్నట్లు 2023లో నమోదైన కేసులో ముగ్గురు నిందితులను గతంలోనే అరెస్టు చేశారు. ఆ కేసులో పరారీలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం దిండి గ్రామానికి చెందిన మేడిది నరేశ్ (26)ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండు విధించారని సీఐ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి గాయాలు.. **యలమంచిలి, న్యూస్‌టుడే:** గుంపర్రు పంచాయతీ కార్యదర్శి మన్నె మాధురి మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఆమె చేతికి, కాలికి తీవ్ర గాయాలవగా మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరానికి తరలించారు. ఒకటో తేదీ కావడంతో పింఛన్ల పంపిణీ నిమిత్తం ఉదయాన్నే ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయల్దేరిన మాధురి మేడపాడు వచ్చేసరికి సైకిలిస్టును తప్పించబోయి ప్రమాదానికి గురయ్యారు.

అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలి

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని శివదేవుని చిక్కాల జిల్లా పరిషత్ పాఠశాల నందు బేటీ బచావో బేటీ పఢావో, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం వైద్యుడు అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాము మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. చరవాణులకు దూరంగా ఉంటూ గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రదర్శన నిర్వహించారు.

పారిశుద్ధ్యంతోనే ప్రజారోగ్యం.. **పెనుగొండ, న్యూస్‌టుడే:** పారిశుద్ధ్యం మెరుగుతోనే ప్రజారోగ్యం సాధ్యమని వడలి సర్పంచి కాసాని విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా వడలి పంచాయతీ కార్యాలయంలో ఆమె, పంచాయతీ కార్యదర్శి పి.అచ్యుత రామకృష్ణ పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గణపతినీడి రామారావు, చంటి తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు, సిబ్బంది

ప్రొటోకాల్ పాటించలేదని ఫిర్యాదు

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో ఇటీవల నిర్వహించిన అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవంలో కమిషనర్ ఎం.అంజయ్య ప్రొటోకాల్ పాటించలేదని ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ మంగళవారం కలెక్టర్ నాగరాణికి ఫిర్యాదు చేశారు. భీమవరంలో నాగరాణిని కలిసి వినతి పత్రం అందించారు. వైస్ ఛైర్‌పర్సన్ కామన నాగిని, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

శ్మశానవాటికలకు స్థలాలు కేటాయించాలి

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండలంలోని పలు గ్రామాల్లో శ్మశానవాటికల సమస్య ఉందని మాలమహానాడు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆచంట ఇన్‌ఛార్జి తహసీల్దార్ సోమేశ్వరరావును మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.పుష్పరాజు, జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజ్‌కుమార్ తదితరులు కలిశారు. శ్మశానవాటికలు లేని గ్రామాల్లో స్థలాలు సేకరించాలని, దుస్థితిలో ఉన్న వాటిని బాగు చేయించాలని కోరారు. ఎస్సీ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

'మద్యం'తరంగా తెరిచారు..!

పాలకొల్లు, న్యూస్‌టుడే: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే ఒప్పంద ఉద్యోగులు నిరసనకు దిగడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న దుకాణాలు గురువారం సాయంత్రం వరకు తెరుచుకోలేదు. వాస్తవానికి ఉదయం 11 గంటలకు తెరవాల్సిన దుకాణాలు సాయంత్రం 5 గంటలకు తెరవడంతో అన్ని చోట్ల మందుబాబులు బారులు తీరారు.

ఉద్యోగాల్లో కొనసాగించాలని నిరసన

నరసాపురం, న్యూస్‌టుడే: తమను ఉద్యోగాల్లో కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బంది మంగళవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దుకాణాలు మూసివేసి నిరసనలో పాల్గొన్నారు.

అవి ఇవి అన్నీ



మురుగు కాలువల నిర్వహణ సక్రమంగా ఉండాలి: కమిషనర్.. **నరసాపురం, న్యూస్‌టుడే:** పురపాలక సంఘం పరిధిలో డ్రెయిన్ల నిర్వహణ సక్రమంగా జరగాలని కమిషనర్ అంజయ్య సూచించారు. మంగళవారం పట్టణంలోని 8, 9 వార్డులను సందర్శించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ పెమ్మాడి శశి వెంకట శ్రీదేవి, పెండ్ర శ్రీను, రామకృష్ణ, శిరిగినీడి లక్ష్మీచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు ఎక్సైజ్ సీఐగా శ్రీనివాస్.. **పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే:** పాలకొల్లు ఎక్సైజ్ సీఐగా మద్దాల శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు తాడేపల్లిగూడెంలో విధులు నిర్వహించి ఇక్కడకు బదిలీపై వచ్చారు.


ఈవోపీఆర్డీ ఆంజనేయశర్మ బదిలీ.. **నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** నరసాపురం మండల ఈవోపీఆర్డీ జి.ఆంజనేయ శర్మ ఉండ్రాజవరం మండలానికి బదిలీ అయ్యారు. నాలుగున్నరేళ్లు ఆయన ఇక్కడ ఈవోపీఆర్డీగా పని చేశారు. ఆయన స్థానంలో కాకినాడ గ్రామీణ మండలం నుంచి నాగేంద్ర రానున్నారు.

రోగికి చేయూత.. **పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే:** దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న కోనసీమ జిల్లా మానేపల్లికి చెందిన బాస శ్రీనివాసరావుకు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ రూ.21 వేల విలువ గల ఇంజెక్షన్లు, మందులను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీరు సాహెబ్, ఉపాధ్యక్షుడు ఎం.బసవరాజు, కోశాధికారి పి.ఉమాశంకర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం.. **పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే:** చింతపర్రు గ్రామానికి చెందిన మంచానికి పరిమితమైన బత్తిన సత్యవరప్రసాద్‌కు వసుధా ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు రూ.10 వేలు ఆర్థిక సాయం మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శ్రీను, వెంకట్ పాల్గొన్నారు.

యోగా పోటీలు.. **మార్టేరు, న్యూస్‌టుడే:** మార్టేరు ఎస్వీజీ క్రీడా ప్రాంగణంలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో యోగా పోటీలను నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఈ పోటీలకు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ చూపిన వారిని జిల్లా పోటీలకు పంపిస్తామని నిర్వాహక కన్వీనర్ కృష్ణారెడ్డి తెలిపారు.

పోడూరులో మిషన్ వాత్సల్య.. **పోడూరు, న్యూస్‌టుడే:** పోడూరు ఎంపీడీవో కార్యాలయంలో మిషన్ వాత్సల్య కార్యక్రమం సంబంధిత లబ్ధిదారులతో మంగళవారం నిర్వహించారు. తల్లిదండ్రులు కోల్పోయిన 18 ఏళ్ల లోపు బాల బాలికలకు ఈ పథకంలో ప్రభుత్వం పరిహారం అందిస్తుందని సీడీపీవో ఇందిర తెలిపారు. ఈ సందర్భంగా ఆమె పలు విషయాలను వివరించారు.



పాఠశాలకు బెంచీలు, కుర్చీల వితరణ.. **పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే:** పాలకొల్లు మండలం లంకలకోడేరు జిల్లా పరిషత్ పాఠశాలకు దాత కె.ఆనంద్‌కుమార్ రూ.6 లక్షల విలువైన బెంచీలు, కుర్చీలు తదితర ఫర్నిచర్‌ను మంగళవారం అందించారు. ఈ సామగ్రి జిన్నూరు, చింతపర్రు, పూలపల్లి, ఆగర్రు పాఠశాలలకు కూడా అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ అధ్యక్షుడు బుద్ధరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి


పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు కమిషనర్ ఏసుబాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కడకట్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఇంటింటికీ వెళ్లి తప్పనిసరిగా చెత్త సేకరించాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవిత బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికులు జీవిత బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సంఘం అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో తపాలా శాఖ జీవిత బీమా పథకాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తక్కువ ప్రీమియంతో అధిక మొత్తంలో ప్రమాద పరిహారం అందించే విధంగా కేంద్రం ప్రభుత్వం జీవిత బీమా పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ధనరాజు కుటుంబానికి రూ.10 లక్షల బీమా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పవనసుతునికి తమలపాకుల పూజలు



అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి పెద్ద వంతెన వద్ద ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న పంచముఖ ఆంజనేయుడికి మంగళవారం ఆలయ అర్చకులు వాడపల్లి రామాచార్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని తమలపాకులతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.


విద్యార్థులతో కలిసి పిచ్చి మొక్కలు తొలగిస్తున్న గోపాల్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: వీసీ


ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని వెంకట్రామన్నగూడెం వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.గోపాల్ పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక వర్సిటీ పరిపాలన భవనం ఉద్యాన కళాశాల ప్రాంగణాన్ని విద్యార్థులు శుభ్రం చేశారు. రిజిస్ట్రార్ శ్రీనివాసులు, డీన్‌లు నారం నాయుడు, సూర్యకుమారి, ఏవీడీ దొరాజీరావు, విస్తరణ సంచాలకుడు గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.


నరేంద్ర కూడలి వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వద్దు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ ప్రతాప్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు బొద్దాని నాగరాజు అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రదర్శన చేశారు. మురళి, కిషోర్, రాధాకృష్ణ, ఆదినారాయణ, గోపి, దక్షిణామూర్తి, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

బక్కచిక్కుతున్న బాల్యం



చిన్నారుల్లో పోషకాల లోపం

పెంటపాడు, న్యూస్‌టుడే: పోషకాహార లోపంతో చిన్నారులు బలహీనంగా మారుతున్నారు. పేదరికం, తల్లిదండ్రుల్లో అవగాహన లేకపోవడం వంటి కారణాలతో పిల్లలు బక్కచిక్కుతున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చేపట్టిన సమగ్ర సర్వే ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఈ సర్వే ప్రకారం తాడేపల్లిగూడెం ఐసీడీఎస్ పరిధిలో నియోజకవర్గ పరిధిలోని 214 అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలపై సర్వే చేశారు. బాలల బరువు, ఎత్తు, శారీరక పరిస్థితి ప్రత్యేక యాప్‌లో పొందుపరిచారు. ప్రతి నెలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.

కారణాలు అనేకం..

గతంతో పోలిస్తే పుట్టినప్పటి నుంచి ఆరేళ్లు వచ్చే వరకు పిల్లలకు ఇంట్లో తయారుచేసిన నాణ్యమైన పోషకాలు, విటమిన్ల పదార్థాలనే అందించేవారు. బయట దొరికే వంటలపై ఆధారపడి ఇంట్లో తయారు చేయడం తగ్గించేశారు. గతంలో అయితే అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేకంగా కిచెన్‌గార్డెన్ పేరుతో స్వయంగా కూరగాయలు పండించి కేంద్రాలకు వచ్చే పిల్లలకు నిత్యం అందించేవారు. ఇప్పుడు ఏ కేంద్రంలోనూ అవి కనిపించడం లేదు. అధిక ఖర్చుతో కూడిన కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేసి పిల్లలకు అందించే స్థితిలో కేంద్రాలు లేవు.

నియోజకవర్గ పరిధిలో తాడేపల్లిగూడెం పట్టణం, తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో చిన్నారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా తప్పక బరువు, ఎత్తు, ఇతర అంశాలు నమోదు చేస్తుంటారు. వయసుకు తగ్గ బరువు, ఎత్తులేని చిన్నారుల్లో లోపం ఉన్నట్లు గుర్తించి వారికి ప్రత్యేకంగా ఆహారం అందిస్తున్నారు. ఇలా చేసినా కూడా పిల్లల్లో అయిదు నుంచి ఎనిమిది శాతం మంది పౌష్టికాహారం లోపంతో బాధపడుతున్నారు.

పునరావాస కేంద్రం ఉన్నా

పౌష్టికాహార లోపం తీవ్రంగా ఉన్న చిన్నారులకు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోషకాహార పునరావాస కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అక్కడకు పిల్లలను తీసుకెళ్తే కనీసం పదిహేను రోజుల పాటు వారిని గమనిస్తూ ప్రత్యేక ఆహారం అందిస్తారు. చిన్నారుల తోపాటు సహాయకులకు భోజనం ఏర్పాటు చేస్తారు. వీటిపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.


పెంటపాడు వెలమపేట అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తు, బరువు చూస్తున్న అంగన్‌వాడీ నిర్వాహకురాలు

"పిల్లల్లో పోషణలోపం, ఎత్తుకు తగ్గబరువు లేని వారి వివరాలు తెలుసుకున్నాం. వీరిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. అవసరమైన వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోని పునరావాస కేంద్రంలో మరిన్ని వైద్య పరీక్షలు నిర్వహించి పౌష్టికాహారం అందేలా చూస్తున్నాం." అని అని సీడీపీవో సరస్వతి తెలిపారు.

తాడేపల్లిగూడెం ఐసీడీఎస్ పరిధిలో వివరాలు..	మొత్తం చిన్నారులు : 11,612 (ఆరు సంవత్సరాల లోపు)	పోషకాహార లోపంతో బాధపడేవారు: 1133

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM	
తాడేపల్లిగూడెం	: 79950 67078
పెంటపాడు	: 79939 36123
తణుకు గ్రామీణ	: 85558 50851
అత్తిలి	: 91548 46774

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే

సమస్య: తాడేపల్లిగూడెం నుంచి తణుకు వెళ్లే రోడ్డు గోతులు పడి అధ్వానంగా తయారైంది. ప్రయాణికులు ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. **-సత్యవతి, స్థానికురాలు**

సమాధానం: రహదారి మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. త్వరితగతిన గోతులు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. **-రవి, రభా శాఖ ఏఈ**

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే

సమస్య: తాడేపల్లిగూడెం పట్టణం సుబ్బారావుపేట వెంకటరత్నం ఆసుపత్రి ఎదురుగా రహదారిలో మురుగునీరు చేరి ఛిద్రంగా మారుతుంది. **- శివన్నారాయణ, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి మురుగునీరు రాకుండా నిలుపుదల చేసేలా చర్యలు చేపడతాం. **-శ్రీమన్నారాయణ, శానిటరి ఇన్‌స్పెక్టర్**

సమస్య: తాడేపల్లిగూడెం పట్టణం యాగర్లపల్లి నిరాశ్రయుల భవనం వెనుక రహదారిలో మురుగుబోధినిండుకుని భరించలేని దుర్వాసన వస్తోంది. **- రాఘవ, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి మురుగు నీరు సాఫీగా ముందుకు సాగేలా చర్యలు చేపడతాం. **- సోమశ్వరరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్**

పెంటపాడు న్యూస్‌టుడే

సమస్య : పెంటపాడు మిడ్‌లెవల్ కాలువ వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలు, జంతు కళేబరాలు పడేస్తుండటంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- రమేష్, స్థానికుడు**

సమాధానం : రహదారి వెంబడి చెత్త, వ్యర్థాలు తొలగిస్తాం. **- తాడేపల్లి సూర్యకళ, సర్పంచి**

సమస్య : పెంటపాడు మండలం రావిపాడులో సేకరించిన చెత్తను అలంపురం వెళ్లే రహదారి పక్కనే డంప్ చేస్తున్నారు. దీంతో రహదారిలో రాకపోకలు చేస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- నారాయణ, స్థానికుడు**

సమాధానం : సేకరించిన చెత్తను మరో ప్రాంతానికి తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. రహదారి పక్కనే వేసిన చెత్తను తొలగిస్తాం. **- పెన్నాడ, సూరిబాబు, సర్పంచి**

మాట తప్పని నాయకుడు చంద్రబాబు: ఆరిమిల్లి


గోటేరులో పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు గ్రామీణం, అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మాట తప్పని నాయకుడు చంద్రబాబు అని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 14వ వార్డులో ప్రారంభించారు. తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లోని కొమరవరం, గోటేరు, కేవేస్‌గట్టు గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో ఇచ్చి న అన్ని హామీలు అమలు చేస్తామని, సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. అధికారులు, ఎన్డీయే నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయేతోనే అభివృద్ధి


మెట్టఉప్పరగూడెంలో పింఛను అందజేస్తున్న వలవల బాబ్జీ

తాడేపల్లిగూడెం టౌన్, వన్ టౌన్, పెంటపాడు, న్యూస్‌టుడే: ఎన్డీయే ప్రభుత్వంలోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని తెదేపా తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ అన్నారు. మంగళవారం ఆయన తాడేపల్లిగూడెం 4, 9వ వార్డు, మొదుగగుంట, మెట్టఉప్పరగూడెం, పెంటపాడు మండలంలోని వల్లూరుపల్లి గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వృద్ధులకు పింఛన్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం జరిగేలా సీఎం నారా చంద్రబాబునాయుడు పరిపాలన ఉంటున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. వెంకట్రావు, దాసరి అప్పన్న, గంధం సతీశ్, పట్నాల రాంబాబు, సర్పంచి రామారావు, యేరు బండి సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధం



అత్తిలి గ్రామీణం , న్యూస్‌టుడే: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అత్తిలి మండలంలోని గ్రామాల్లో ఆలయాలు, మండపాలను శోభాయమానంగా సిద్ధం చేస్తున్నారు. వినాయక చవితి ముగిసిన నాటి నుంచే కళాకారులు అమ్మవారి విగ్రహాలను తుదిమెరుగులు దిద్దడంలో నిమగ్నమయ్యారు. భక్తుల అభిరుచులకు తగ్గట్టుగా ప్రతిమలు వివిధ ఆకృతుల్లో రూపుదిద్దుకుంటున్నాయి. అత్తిలి గ్రామం, కె.సముద్రపుగట్టు వెళ్లే దారిలో విగ్రహాలను విక్రయానికి సిద్ధంగా ఉంచారు.

మూడు నుంచి... తాడేపల్లిగూడెం టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో ఈ నెల మూడు నుంచి జరిగే శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొర్లేపర శ్రీరామచంద్రమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆర్యవైశ్య సంఘం సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ సుమారు రూ.50 లక్షల వ్యయంతో అమ్మవారి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సుందరం, భోగవిల్లి రమేశ్, నున్న ఆనంద్, చలంచర్ల గుప్తా, ఆలపాటి చిన్నా, పులవర్తి రాంబాబు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో దసరా సంబరాలు... తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల పాఠశాలలో ముందస్తు దసరా ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ బాలలు సంప్రదాయ దుస్తుల ధరించి ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సత్కారం పొందిన వృద్ధులతో అసోసియేషన్ సభ్యులు

ఘనంగా వృద్ధుల దినోత్సవం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బ్యాంక్ కాలనీ కార్యాలయంలో మంగళవారం ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు అధ్యక్షతన ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఉప్పాడ్ వృద్ధుల జీవన స్థితిగతులు తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో బసవా రామకృష్ణ, కార్యదర్శి స్టాలిన్, కోశాధికారి భాస్కరరావు, బాపినీడు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సంరక్షణ బాధ్యత పిల్లలదే

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: వృద్ధాప్యంలో ఉన్న వారికి సంరక్షణ కల్పించాల్సిన బాధ్యత పిల్లలపైనే ఉందని విశ్వ విజ్ఞాన ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి ఉమర్ అలీషా అన్నారు. మంగళవారం ఆధ్యాత్మిక పీఠం స్థానిక కార్యకర్తల నేతృత్వంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన జ్ఞాన చైతన్య సదస్సుకు ఉమర్ అలీషా హాజరయ్యారు. ఈ సందర్భంగా 54 మంది వృద్ధులను శాలువాలతో సత్కరించారు. పీఠం కన్వీనర్ నందం తాతయ్య పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాలూకాఫీసు కూడలిలోని పింఛనుదారుల సంఘ భవనంలో అంతర్జాతీయ వయొవృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పింఛనుదారుల తాడేపల్లిగూడెం యూనిట్ ముఖ్య సలహాదారుడు కోటి వీరారావుని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పట్టింపు లేని నిబంధనలు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు నియోజకవర్గంలో తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో చాలా పెట్రోలు బంకుల్లో వినియోగదారులకు సక్రమంగా సేవలందడం లేదు. ఏదైనా పెద్దలు వస్తే మినహా ఎక్కడ అధికారులు తనిఖీలు పూర్తి స్థాయిలో చేయడం లేదని విమర్శలు ఉన్నాయి. మౌలిక వసతులైన మంచినీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉండటం లేదు. వాహన టైర్లకు ఉచితంగా గాలికొట్టే సౌకర్యం కల్పించాలి. కానీ ఇవేమీ ఎక్కడ అమలు అవుతున్న దాఖలాలు లేవు. కొన్ని చోట్ల గాలి పట్టే యంత్రాలు ఉన్నా చాలా వరకు మరమ్మతుకు గురయ్యాయి. సిబ్బంది కూడా అందుబాటులో లేని పరిస్థితి. ప్రథమ చికిత్స కిట్లు కూడా ఉండటం లేదు. 'పెట్రోలు బంకుల్లో వినియోగదారులకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే పౌరసరఫరా అధికారులను సంప్రదించాలి.' అని పౌరసరఫరాశాఖ సంస్థ మేనేజరు ప్రసాద్ తెలిపారు.


అత్తిలి బంకులో నిరుపయోగంగా గాలిపట్టే యంత్రం

తణుకు నియోజకవర్గంలో బంకుల వివరాలు	తణుకు పట్టణం	తణుకు మండలం	ఇరగవరం	అత్తిలి
	7	4	4	6

సంక్షేమ పథకాలు మంజూరు చేయండి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: సంక్షేమ బోర్డులో గుర్తింపు కార్డు పొందిన భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేల్పూరులోని పార్వతీదేవి ఆలయ ఆవరణలో నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల యూనియన్ ద్వారా చేసిన భవన నిర్మాణ కార్మికుల కార్మిక శాఖ అధికారులు మంజూరు చేసిన గుర్తింపు కార్డులను కార్మికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకన్న, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రామకృష్ణ, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీరభద్రరావు

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

నన్నయ విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ (టూరిజం అండ్ హాస్పిటాలిటీ) కోర్సుల్లో భర్తీ చేయని సీట్లకు ఈ నెల ఐదో తేదీన స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఐసెట్‌లో అర్హత సాధించిన వారు మాత్రమే హాజరు కావాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం(ప్రధాన ప్రాంగణం), కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాల్లో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. యూనివర్సిటీలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు ఉదయం 9.30 నుంచి 11 గంటల లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

పెదవేగి, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం నుంచి 6వ తేదీ వరకు పెదవేగి గురుకుల బాలుర పాఠశాల మైదానంలో అండర్-19 విభాగంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభాకరరావు, కె.జయరాజు తెలిపారు.

రహదారికి మరమ్మతులు



తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే : తాడేపల్లిగూడెం పట్టణం పోలీస్ ఐలాండ్ నుంచి బాదంపూడి కాళీకృష్ణ భగవాన్ ఆలయం వరకు రహదారి అధ్వానంగా మారింది. దీనిపై సెప్టెంబరు 22న 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన తాడేపల్లిగూడెం ఆర్ అండ్‌బీ అధికారి రవిబాబు (ఏఈ) అయ్యప్ప స్వామి ఆలయం నుంచి పోలీస్ ఐలాండ్ వరకు మరమ్మతులు చేపట్టారు.

ఈనాడు కథనానికి స్పందన

హైందవ ధర్మ రక్షణకు కృషి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా ఇరగవరం మండలం తూర్పువిప్పరులో ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. మంగళవారం సంకీర్తనలతో హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవం


ద్విచక్ర వాహన ప్రదర్శనలో ఉద్యోగులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సంస్థ 25వ ఆవిర్భావ దినోత్సవం డివిజనల్ ఇంజినీర్ కేవీఏపీ సుబ్బారావు అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు పుర వీధుల్లో ద్విచక్రవాహన ప్రదర్శన చేశారు. ఉద్యోగులు జనార్దనరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతపై అవగాహన


సిబ్బంది ప్రదర్శన

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు ఆరోగ్య నియమాలు పాటించి రోగాలకు దూరంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణంలోని 1, 2 వార్డుల్లో ఆరోగ్య భద్రతపై అవగాహన ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వారానికి ఒకసారి డ్రై డే కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రోల్ బాల్ పోటీలు మంగళవారం స్థానిక మున్సిపల్ స్కేటింగ్ రింగ్‌లో నిర్వహించారు. 50 మంది పోటీల్లో పాల్గొనగా అండర్-14 విభాగంలో 9, అండర్-17 విభాగంలో 6గురు చొప్పున రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అక్టోబర్‌లో తిరుపతిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జాన్సన్, శ్రీనివాస్, నాగరాజం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెకుముకి పోటీలు



తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పోటీలు మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 48 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి రోల్ బాల్ పోటీలు


ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

సుబ్బారావుపేట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల బాలబాలికలకు లాల్‌బహుదూర్ శాస్త్రి జీవిత చరిత్రపై ప్రతిభా పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు లాల్‌బహుదూర్‌శాస్త్రి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం పాఠశాలలో అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

విద్యార్థుల ప్రతిభ

కొమ్ముగూడెం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్),న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం గ్రామీణ మండలం కొమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి అంతర్జాల రంగోత్సవ పోటీల్లో ప్రతిభ కనబర్చారని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. విద్యార్థులను, చిత్రలేఖనం ఉపాధ్యాయిని భువనేశ్వరిలను సర్పంచి తాడేపల్లి బేబి, ఎంపీటీసీ రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.


ధ్రువపత్రాలు, జ్ఞాపికలతో విద్యార్థులు

చెల్లని చెక్కు కేసులో జైలు

మునుసూరు, నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: తన బ్యాంకు ఖాతాలో నగదు లేనప్పటికీ చెక్కు ఇచ్చిన నేరానికి ప్రతిపాటి లోకరాజుకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా విధిస్తూ మంగళవారం నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేటుల కృష్ణమూర్తి తీర్పు ఇచ్చారు. నూజివీడు మండలం గొల్లపల్లికి చెందిన మల్లవల్లి ప్రవీణ్‌కుమార్ 2019 ఆగస్టులో తాడేపల్లిగూడేనికి చెందిన ప్రత్తిపాటి లోకరాజుకు రూ.4 లక్షలు అప్పుగా ఇచ్చారు. కొంతకాలం తర్వాత అప్పు తీర్చమని అడగగా.. లోకరాజు రూ.4 లక్షలకు చెక్కు ఇచ్చాడు. ప్రవీణ్‌కుమార్ ఆ చెక్కును బ్యాంకులో వేయగా.. నగదు లేదని తెలిసింది. దీనిపై కేసు పెట్టగా విచారణ అనంతరం న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

వృద్ధుడి అదృశ్యం

అత్తిలి గ్రామీణం , న్యూస్‌టుడే: అత్తిలి మండలం కె.సముద్రపుగట్టుకు చెందిన సకినాల సత్యనారాయణ(75) కనిపించడం లేదంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొంతకాలంగా సత్యనారాయణకు మతిస్థిమితం సరిగాలేదు. ఈఏడాది ఆగస్టు 18న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వెతికినా ఆచూకీ తెలియ లేదు. బంధువు సకినాల గంగయ్య ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమరాజు తెలిపారు.

పైడిపర్రులో తల్లిదండ్రుల సమావేశం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమష్టి కృషితోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు అన్నారు. మంగళవారం పైడిపర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు మూర్తి, రామలక్ష్మి, స్వరూపారాణి, ఏసుకృప, జయరాజు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.